మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల /నారాయణపేట



# ప్రజల కోసం.. ప్రగతి కోసం తెలంగాణ..!

**సామూహిక వ్యవసాయం వైపు అడుగులు వేయండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి.సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి,అక్టోబర్ 2,ప్రభాతవార్త :** ప్రజల కోసం ప్రగతి కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని,సామూహిక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి.సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.సోమవారం ఆయన గోపాల్ పేట.రేవల్లి మండలాల్లో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల పై సుడిగాలి పర్యటన చేశారు.ఈ సందర్భంగా మంత్రి.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గోపాల్ పేట మండలం మున్ననూరు దళిత రైతులకు రెండో పంట కోసం చేయూతనందించడం జరుగుతుందని,మొదటి పంట కోసం ఇప్పటికే మినీ ఎత్తిపోతల ఏర్పాటు..మినీ ఎత్తిపోతలతో వచ్చిన నీటికి పూజలు చేయడం జరిగిందన్నారు.జయన్న తిరుమలాపూర్ రైతులకు కూడా చేయూతనందిస్తామని,సామూహిక వ్యవసాయంతో అన్ని విధాలా మేలు జరుగుతుందని..వ్యవసాయ కూలీల కొరత,సాగులో మనుషుల ఇబ్బందులు ఉండవన్నారు.9 ఏళ్లలో అన్ని రంగాల్లో సమూల మార్పులు వచ్చాయని,సాగునీటి రాకతో గ్రామాల్లోని ప్రజల జీవన స్థితిగతులలో మార్పులు వచ్చాయని అన్నారు.గ్రామాలకు రహదారులతో పాటు విద్య,వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.మొత్తం రూ.26 కోట్ల పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు మంత్రి.నిరంజన్ రెడ్డి చేశారు.



గోపాల్ పేట,రేవల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి.నిరంజన్ రెడ్డి శంకుస్థాపన

## అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు..

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి**

**పాలమూరులో అరాచక పాలనను తరిమికొడదాం**

**మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష**



దీక్షలో మాట్లాడుతున్న జి. మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబర్ 2 ప్రభాత వార్త:**అధికారాన్ని అడ్డుపెట్టుకుని నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడుతున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిరాహార దీక్ష చేపట్టారు. డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ అరాచక పాలన నుంచి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ విముక్తి కల్పిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా ఏకమై పాలమూరులో అరాచక పాలనను తరిమికొడదామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నియోజకవర్గంలో నియంత పాలన కొనసాగుతున్నదని ఆరోపించారు. పాలమూరులో గతంలో చూడని అక్రమాలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మధ్య అఘాథాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేస్తామని అన్నారు. ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మార్పులు కోరుతున్నారని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీక్షలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎస్. వినోద్‌కుమార్, నాయకులు వసంత, సిరాజ్‌ఖాద్రి, రాములు యాదవ్, బురుజు సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్ యాదవ్,సిరాజ్ ఖాద్రి, అజ్మత్ అలీ, రాములుయాదవ్, అవెజ్, చంద్రశేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతిపిత మహాత్మాగాంధి జయంతి వేడుకలు..

**స్వచ్ఛత పరిసరాల పరిశుభ్రత పాటించాలి:జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** భారత జాతిపిత మహాత్మాగాంధి చూపిన శాంతి సామరస్యం ద్వారా ఏ సమస్య అయినా పరిష్కరించుకోవద్దని, స్వచ్ఛతకు పేరుగాంచిన మహాత్మాగాంధి జయంతి సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం జాతిపిత మహాత్మాగాంధి 154వ జయంతిని పురస్కరించుకుని గద్వాల పట్టణంలోని గాంధిచౌక్‌లో గల మహాత్మాగాంధి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీని వాస్, డిపిఆర్ఓ చెన్నమ్మ, డిఆర్‌డిఎ ఉమాదేవి, ఏఓ భద్రప్ప, ఇడి ఎస్సీ కార్పోరేషన్ రమేష్‌బాబు, ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి,శానిటరీ ఇన్స్‌పెక్టర్ మన్సూర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధి జయంతి సందర్భంగా నివాళులర్పించిన కలెక్టర్ తదితరులు

## గాంధీ చూపిన శాంతి, అహింసా మార్గం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచింది...

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,అక్టోబర్ 02 ప్రభాతవార్త:**గాంధీచూపిన శాంతి, అహింసా మార్గం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఉదయం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అహింసా సిద్ధాంతంతో ఏదైనా సాధించవచ్చునని, ప్రపంచానికి చాటిచెప్పిన మహానీయుడు మహాత్మాగాంధీఅన్నారు. ప్రపంచంలో ఏ దేశమైన గాంధీ చూపినమార్గమే శిరోధార్యమని తెలుసుకొని పాటిస్తున్నాయని చెప్పారు.ఆనాడు మహాత్ముడు చెప్పిన స్వచ్ఛత, పరిశుభ్రత అనే మాటలు నేడు పట్టణాలతో సహా పల్లెపల్లెలు పాటిస్తున్నాయన్నారు.దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు అన్న జాతిపిత నినాదాన్ని చాటుతూ దేశంలో గ్రామాలు ప్రగతి సాధిస్తున్నాయన్నారు.మహానీయుడి అడుగుజాడల్లో యువతనడువాలని కోరారు.కార్యక్రమంలో పీడీ ఆర్డీఓ నర్సింగ్‌రావు, డీపీఆర్ఓ సీతారాం,సి.సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్, కలెక్టరేట్, ఇతర శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, కార్యాలయ అధికారులు

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి...

**కల్వకుర్తి, అక్టోబర్ 02 ప్రభాతవార్త:**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, తమకు ఇష్టమైన క్రీడారంగంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు.విద్య ద్వారానే వికాసం లభిస్తోందని, విద్యకు సమాజగమణాన్ని తోడ్పడుతుందన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 13 గురుకుల పాఠశాల విద్యార్థినులు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్‌కు విద్యార్థినులు మార్చి పాస్ట్ ద్వారా గౌరవ వందనం సమర్పించి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ క్రీడా ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ జెండాతో పాటు క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సీఎంగా ఉన్నప్పుడు నల్గొండ జిల్లాలోని సర్వేలో మొట్టమొదటి గురుకులం ప్రారంభమైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తెలంగాణలో 1001 గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో 13లక్షలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, గురుకుల విద్యార్థులకు రూ.1.21లక్షలు అందిస్తుందన్నారు. విద్యపరంగా కల్వకుర్తిని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కల్వకుర్తి మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపుఉందని,దానికి శ్రమిస్తున్న ప్రిన్సిపాల్,ఇతర అధ్యాపక బృందాన్ని ఎమ్మెల్యే ప్రశంసించారు.అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ సామ మనోహర చెన్నకేశవ,మార్కెట్ కమిటీచైర్మన్ విజయ్‌గౌడ్,వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన, కౌన్సిలర్లు మనో హర్‌రెడ్డి, నాయకులు నూనె శ్రీనివాస్, భావండ్ల మధు, నాయకులు రాకేష్‌శర్మ, దామోదర్‌రెడ్డి, బన్నె శ్రీధర్, ఆర్‌సిఓ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సరిత, వెంకటేశ్వర్లు, ఎంజేపీ ఖోఖో కోచ్ శ్రీనివాస్, నాయకులు రామరాజు, మబ్బు సాయన్న,ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, హరిదాసు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం, గురుకుల పాఠశాల అధ్యాపక బృందం

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

కల్వకుర్తి మండలం జిల్లెల గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె ప్రకృతి వనం, వైకుంఠ దామాలను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గ్రామ సర్పంచ్ ఎముక జంగయ్యతో కలిసి ప్రారభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి అని ఆయన గుర్తు చేశారు. ఇతర మోసపూరిత పార్టీల మాటలను నమ్మి ఆగం కావద్దని, అభివృద్ధిని నిలుపుకోవద్దన్నారు. కార్యక్రమంలో జిల్లెల్ల గ్రామ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## మన్ననూరు గురుకుల నిర్వహణ

# తీరు మారదా..!

- మళ్లీ అస్వస్థతకు గురైన విద్యార్థినులు
- పరామర్శించిన డీసీసీ జిల్లా అధ్యక్షులు చిక్కుడు వంశీకృష్ణ
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ మాదిగ



విద్యార్థినులను అంబులెన్స్‌లో చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

**అచ్చంపేట, అక్టోబర్ 02 ప్రభాతవార్త:**అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం మరోసారి భోజనం వికటించి విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన చోటు చేసుకుంది. గత 10 రోజుల క్రితం భోజనం వికటించి 200మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై నానా ఇబ్బందులు పడిన విషయం మరువక ముందే సోమవారం మరోసారి భోజనం వికటించి సుమారు 20మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో చికిత్సనిమిత్తం అచ్చంపేట 100 పడకల ఆసుపత్రికి తరలించగా 5 మంది విద్యార్థినుల పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మన్ననూర్ గురుకుల పాఠశాలలో వరుసగా జరుగుతున్న ఈ సంఘటనలపై చర్యలు చేపట్టకపోవడం వల్లే నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. విషయం తెలుసుకున్న డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆసుపత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట పట్టణంలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రికి పేరుకు మాత్రమే ఉందని, విద్యార్థినులు అస్వస్థతకు గురైన మెరుగైన చికిత్స అందించడానికి సరైన సదుపాయాలు అందుబాటులో లేనందున బాధితులను జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న ఆసుపత్రిలోమాత్రం చికిత్స అందించలేని దుస్థితి అచ్చంపేట ఉందని, ఆసుపత్రిలో కావాల్సిన సదుపాయాలను కల్పించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవని సతీష్ మాదిగ చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గురుకులానికి కల్తీ పదార్థాలు సరఫరా చేయడం వల్లే అనారోగ్యానికి గురవుతున్నారని విమర్శించారు. గత కొద్ది రోజుల క్రితం ఇదే పాఠశాలలో 200 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ప్రభుత్వానికి పట్టింపులేదని, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థినుల జీవితాలపై లేదన్నారు.





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న వంశీకృష్ణ. సతీష్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

## గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యం..!

**పల్లె ప్రగతితో మెజారిటీ సమస్యల పరిష్కారం**

**మహాత్ముని విగ్రహానికి నివాళులు..**

**ఘనంగా తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ విగ్రహవిష్కరణ చేసిన మంత్రి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి,అక్టోబర్ 02,ప్రభాతవార్త :** గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగాపని చేస్తున్నామని, పల్లె ప్రగతితో మెజారిటీ సమస్యల పరిష్కారం అయ్యాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి.సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.సోమవారం పెద్దమందడి మండల కేంద్రంలో గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముని విగ్రహానికి అయన నివాళులు అర్పించారు.అనంతరం రూ.20లక్షల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం,రూ.20 లక్షల రెండు ఫార్మేషన్ రహదారులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి.మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని,పట్టణాలకు ధీటుగా పల్లెల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయని అన్నారు.విద్య,వైద్య సౌకర్యాలు మెరుగు పరిచి,సాగునీటి రాకతో వ్యవసాయం బలోపేతమై ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు.ప్రభుత్వ సహకారంతో అన్ని వర్గాల అర్థికంగా నిలదొక్కుకోవాలని,సమాజంలోని అన్ని వర్గాలు ఉన్నతంగా జీవించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ తపన అని గుర్తు చేశారు.పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయం ప్రారంభించారు.మండల కేంద్రంలో మృతి చెందిన పలువురు భౌతికఖాయానికి మంత్రి నిరంజన్ రెడ్డి నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులకు పరామర్శించారు.

**ఖిల్లా గణపురంలో...** మండల పరిధిలోని సోలిపుర్ గ్రామంలో సోమవారం తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం మంత్రి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు దేవరకొండ విజయ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ చాకలి చిట్యాలఐలమ్మ ఎంతో ధైర్యవంతురాలు ధర్మం కోసం న్యాయం కోసం పోరాటం చేసిన గొప్ప మహిళ వేత్త యావత్తు మహిళ లోకానికి స్ఫూర్తి ఆమె జీవిత చరిత్ర ఎంతో గొప్పనైనది ఇప్పుడున్న తరాలకు ఆమె గురించి తెలియచెయ్యాలి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీరానారి బిరుదును ఐలమ్మకు ఇచ్చి గౌరవించింది అన్నారు.విగ్రహాలు ఏర్పాటు చేయడం గొప్పకాదు ఐలమ్మ స్పూర్తితో మహిళలు ధైర్యంగా ఎలా ముందుకు సాగాలో నేర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు దేవరకొండ విజయ్ జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ టి.బలీశ్వర్ రెడ్డి స్థానిక సర్పంచ్ పద్మ బలీశ్వర్ రెడ్డి నాగన్న పెంటయ్య రాములు బాలస్వామి అనిల్ వెంకటమ్మ బుచ్చి బాబు జంగయ్య బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



పెద్దమందడి మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి.నిరంజన్ రెడ్డి

## హరీష్‌రావు రాక సందర్భంగా పటిష్ట బందోబస్తు

**నారాయణపేట ప్రతినిధి,అక్టోబరు 02 ప్రభాతవార్త :** 4వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కోస్గి మండల కేంద్రంలో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి వస్తున్నందు జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు పోలీసు అధికారులతో, లైబ్రరీ చైర్మన్ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి మంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్, ప్రభుత్వ ఆసుపత్రి, పబ్లిక్ మీటింగ్‌ల దగ్గర పోలీస్ బందోబస్తు గురించి, బారికేడ్ల ఏర్పాటు, ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు భద్రతపరమైన సూచనలు ఇచ్చారు. మంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.సత్యనారాయణ, సిఐ జనార్ధన్, ఎస్సైలు శ్రీనివాసులు, నరేష్, ఎస్బీ ఎస్సై సురేష్, లోకల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

## ప్రపంచంలో అతిపెద్ద అర్బన్ ఎకోపార్కు..!

**జంగిల్ సఫారీని ప్రారంభించిన**

**మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపి సంతోష్‌కుమార్**

**వేలాది పక్షుల సమాహారం బర్డ్స్ ఎన్‌క్లోజర్‌కు భూమిపూజ**

**మహబూబ్‌నగర్,అక్టోబరు 02 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కెసిఆర్ అర్బన్ ఎకో పార్కులో రూ. 2.70 కోట్లతో నిర్మించనున్న బర్డ్స్ ఎన్‌క్లోజర్‌ను ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్‌తో కలిసి మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం 26 వేల ఎకరాల్లో దేశంలోనే పెద్ద జంగిల్ సఫారీని, నూతనంగా సిద్ధం చేసిన డిస్కవరీ ఛానల్ తరహా రెండు సఫారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సఫారీ వాహనంలో వాచ్ టవర్ వరకు ప్రయాణించారు. వాచ్ టవర్ చేరుకుని పైకి ఎక్కి అడవిని తిలకించారు. అక్కడ విలేఖరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద అర్బన్ పార్కులో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ద్వారా పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడుతున్న ప్రకృతి ప్రేమికుడు ఎంపి సంతోష్ చేతులమీదుగా జంగిల్ సఫారీని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చేలా జంగిల్ సఫారీని తీర్చిదిద్దుతామన్నారు.

**ప్లాస్టిక్ ఫ్రీ ఫారెస్టుగా కెసిఆర్ అర్బన్ ఎకో పార్కు : ఎంపి సంతోష్‌కుమార్**

అతిపెద్ద అర్బన్ ఎకో పార్కులో 1.5 ఎకరాల్లో వేలాది పక్షులతో బర్డ్స్ ఎన్‌క్లోజర్‌ను ప్రారంభించడం సంతోషమని ఎంపి సంతోష్‌కుమార్ తెలిపారు. అర్బన్ ఎకో పార్కును ప్లాస్టిక్ ఫ్రీ పార్కుగా తీర్చిదిద్దుదామని ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. దేశంలోని ఏ ఇతర ఫారెస్టుకు తీసిపోని విధంగా కెసిఆర్ ఎకోపార్కు ఉందన్నారు. ప్రభుత్వం తరపున, తన తరపున అడవి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని ఎంపి తెలిపారు. తర్వాత తిరిగి సఫారీ వాహనంలోనే అడవిలో ప్రయాణించారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కెసి నర్సింహులు, మార్కెట్ కమిటి చైర్మన్ రెహమాన్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్ తదితరులున్నారు.

## ప్రధాని నరేంద్రమోడీకి ప్రత్యేక అభివాదం చేసిన బీజేపీ నాయకులు..!!

**భూత్పూర్,అక్టోబర్ 2,ప్రభాతవార్త :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం పాలమూరు ప్రజాగర్జన బహిరంగసభను భూత్పూర్ పట్టణంలోని ఐటీఐ గ్రౌండ్స్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాని మోడీ సభాస్థలికి చేరుకునే సమయంలో బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి,పట్టణ 8వ వార్డ్ కౌన్సిలర్ తైసిన్ ఫాతిమా ఫారూఖ్ ప్రధాని మోడీని ప్రత్యేక కలిసి భూత్పూర్‌కు వచ్చినందున ప్రత్యేక ధన్యవాదాలతో అభివాదాలు చేశారు.ప్రతీగా ప్రధాని వారికి ప్రతినమస్కారం చేశారు.





# మోడీ పాలమూరు పర్యటన కేవలం ఎన్నికల స్టంటే..!!

**- ప్రధాని మోడీ పర్యటన అంతా సినిమాయే.. - దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపణ**

**భూత్పూర్,అక్టోబర్ 2,ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్రమోడీ పాలమూరు పర్యటన అంతా సినిమా పక్కీలో సాగిందని,మోడీ పర్యటన కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.సోమవారం ఎమ్మెల్యే భూత్పూర్ మండలంలో పలు అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు చేశారు.పోతులమడుగులో రు.2.54కోట్ల వ్యయంతో నిర్మించే చెక్‌డ్యాంకు శంకుస్థాపన,భూత్పూర్ మండలం పెద్దతండాలో రు.20 లక్షల వ్యయంతో నిర్మించే నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన,లంబడికుంట తండాలో రు.20లక్షల వ్యయంతో నిర్మించే జీపీ నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, కొత్తూరు గ్రామంలో రు.20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం,కొత్తమొల్గరలో రు.20లక్షలతో నిర్మించిన జీపీ భవనాలను ఎమ్మెల్యే ఆల ప్రారంభించారు.

**ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు..**

భూత్పూర్ మండలం ఎల్కిచెర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సర్పంచి పద్మజక్కిరెడ్డితో పాటు వార్డు సభ్యులు నర్సింహ్మారెడ్డి,చెన్నారెడ్డి, సత్యాచారి,మోహన్‌రెడ్డి,మల్లికార్జున్,హరిజన్ కృష్ణయ్య,మణ్యంతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు కరుణాకర్,రంగనాథ్,మహేష్, నర్సింహ,రాము,గుమ్మడి శ్రీకాంత్,పవన్,మహేష్, నర్సింహ,ప్రదీప్‌తో పాటు మరో 100మంది ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు తన సమక్షంలో బీఆర్ఎస్ చేరారని ఎమ్మెల్యే తెలిపారు.మద్దిగట్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరినట్లు ఎమ్మెల్యే ఆల తెలిపారు.కాంగ్రెస్ పార్టీకి చెందిన కుమ్మర పర్వతాలు,నర్సింహ్మ,వెంకటేష్, చెన్నకేశవ్, వెంకటేష్,నాగయ్య,గంగపురితో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు.భూత్పూర్ మండలం తాటిపర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీలు బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. మోల్‌సాబ్,ఎండి యాకూబ్,పదోవార్డు సభ్యుడు ఎండి మీర్,సల్మాన్,ఇస్మాయిల్,యాసిన్,ముంతాజ్,షాహిన్‌బేగం,ఎండి రియాజ్,ఎండి వాజిద్,కృష్ణ,సద్దాం హుస్సేన్‌తో పాటు మరో 50మంది కాంగ్రెస్‌ను వీడి తమ పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.వీరందరూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్‌లో చేరారని ఎమ్మెల్యే ఆల స్పష్టం చేశారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



పోతులమడుగు పెద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల



కొత్తమొల్గరలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## ఘనంగా మహాత్మాగాంధి జయంతి వేడుకలు

**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** గద్వాల పట్టణంలోని గాంధిచౌక్ దగ్గర గాంధి జయంతి,లాల్ బహద్దూర్ జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ నివాళులర్పించారు. అనంతరం గాంధి జయంతిని పురస్కరించుకుని ప్రధాన మంత్రి నరెంద్రమోడీ పిలుపుమేరకు భారతదేశం స్వచ్ఛతకోసం మనపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దేశప్రజలందరు ముందుగా మహాత్మాగాంధి జయంతిని పురస్కరించుకుని ఖాదీవస్త్రాలు కొనుగోలు చేశారు.కార్యక్రమంలో ప్రధానమంత్రి నరెంద్రమోడీ స్వచ్ఛభారత్‌కార్యక్రమంలో గ్రామాలఅభివృద్ధికోసం పరిశుద్ధ అభివృద్ధికోసం అనేక రకాల పథకాలు తీసుకొచ్చారని ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగస్వాములు అయినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు.



## ఘనంగా జాతిపిత మహాత్మాగాంధి జయంతి వేడుకలు

**కాంగ్రెస్ పార్టీ గద్వాల తాలూకా కో ఆర్డినేటర్ జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత**

**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జడ్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో గాంధి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ గద్వాల తాలూకా కోఆర్డినేటర్, జడ్పీ ఛైర్ పర్సన్ సరిత తిరుపతయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆడవాళ్లు కూడా అర్థరాత్రి ఒంటరిగా, స్వేచ్ఛగా తిరిగేంత స్వాతంత్రం కావాలని ఆశించారని ఆయన ఆశయాలను సాధించే దిశలో మనమందరం నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్, అల్వాల రాజశేఖర్‌రెడ్డి, పూడూరు ఈశ్వర్, ఇమ్మానుయేల్, అత్తియా పెద్దపల్లి, జనార్ధన్, జనార్ధన్, దౌదర్‌పల్లి నాగరాజు, బాలు, జమ్మిచేడు, రాముడు, సాదిక్, మోహిన్, కృష్ణ, బిల్డర్ రామకృష్ణ, ఆంజనేయులు, కృష్ణ, రాము, సతీష్, కొండపల్లి బాలు, నాగరాజు, సంతోష్, తిమ్మప్ప, జనార్దన్ తదితరులు పాల్గొని మహాత్ముని స్మరించారు.



## బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం

**మూసాపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మూసాపేట మండల ఆదర్శ మహిళా భవనంలో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం మూసాపేట జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్ అడ్డాకుల జడ్పీటిసి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్ మాట్లాడుతూ ఈనెల 4న జరగబోయే హరీష్‌రావు బహిరంగ సభకు ప్రతి గ్రామంనుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మూసాపేట అడ్డాకుల జడ్పీటిసిలు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మినరసింహ యాదవ్, ఎంపిపి, గుపని కళావతి కొండయ్య, వివిధ గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, గ్రామ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.



## విద్యార్థులను అభినందించిన గోపాలం..

**మక్తల్,అక్టోబర్ 2 ప్రభాతవార్త :** 8సంవత్సరాలలోపు బాల బాలికలు బి.హిమాన్స్, సాలమన్, భారతి, అన్వర్, అబ్దుల్ రహీం, 9 సంవత్సరాల్లోపు సాయికుమార్, వరుణ్‌కుమార్, పది సంవత్సరాల్లోపు బి. శ్రీ చాతుర్య, జస్వంత్, ఇ.అక్షర, పవిత్ర 11 సంవత్సరాల్లోపు ఆకాష్,అనిరుధ్,12 సంవత్సరాల్లోపు చక్రవర్తి, వి.నరెందర్, రాష్ట్రస్థాయి స్కైకింగ్ పోటీలకు ఎంపికైన బాలబాలికలు 14 మంది ఎంపికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. రాష్ట్రస్థాయి స్కైకింగ్ క్రీడలకు ఎంపికైన బాల బాలికలు నవంబర్ 13,14తేదీలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్కైకింగ్ పోటీలలో పాల్గొంటారని బి. గోపాలం తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణ కార్యదర్శులు సి. అమ్రేష్, ఎస్. రమేష్‌కుమార్, బి. దామోదర్, దండులక్ష్మి, నీలి యాదగిరి, అబ్దుల్ రవూఫ్, బేబి ఉష, 120 మంది బాల బాలికలు పాల్గొన్నారు.



## కార్మికులకు మద్దతు తెలిపిన వాకిటి శ్రీహరి

**మక్తల్,అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మండలంలోని ఖానాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ కార్మిక సంఘాల జెఏసి (సత్యసాయి సెగ్మెంట్) ఐఎఫ్‌టియు, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతుగా నియోజకవర్గ నేత నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి నిలిచారు. గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని జిఓ నం 60ని అమలు చేయాలని మిషన్ భగీరథ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారు కోరుతున్న డిమాండ్లను తక్షణమే నెరవేర్చి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు, ఖానాపూర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ కార్యకర్తలను బలవంతం పెడితే ఊరుకునేదిలేదు..!!

- భయభ్రాంత్రులకు గురిచేస్తే తాటతీస్తాం
- కాంగ్రెస్ కార్యకర్తలను ప్రలోభపెట్టి బలవంతంగా గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే ఆల
- భూత్పూర్‌లో మీడియా సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)

**భూత్పూర్,అక్టోబర్2,ప్రభాతవార్త:**దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తమపార్టీలో కరుడుకట్టిన నాయకులు,కార్యకర్తలను చెక్కులుఇస్తాం..డబుల్‌బెడ్‌ఇళ్లు ఉస్తామని చెబుతూ ప్రలోభాలకు గురిచేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తు బలవంతంగా తమపార్టీ కార్యకర్తలను ఎమ్మెల్యే తన పార్టీలోకి లాక్కుంటున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ఎమ్మెల్యే ఆలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా జీఎంఆర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి దాచుకోవడం..దోచుకోవడం మాత్రమే తెల్సునని,దోపిడీదారు,దగాకోరు ఎమ్మెల్యే తమ పార్టీ కార్యకర్తలను మభ్యపెడుతూ తన పార్టీ కండువాలు కప్పి బలవంతంగా బీఆంఎస్‌లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు.తమ పార్టీ కార్యకర్తలను భయభ్రాంతులు,ప్రలోభాలకు గురిచేస్తే ఊరుకునేదేలేదని,బలవంతం పెడితే తాటతీస్తామని జీఎంఆర్ హెచ్చరించారు.మద్దిగట్లలో కుమ్మరి పర్వతాలు కరడుగట్టిన కాంగ్రెస్‌వాదని,పర్వతాలు ఎమ్మెల్యే తనను బలవంతంగా పార్టీ కండువా కప్పాడని పేర్కొంటూ తిరిగి తమ గూటికే వచ్చాడని పేర్కొన్నారు.గోపన్నపల్లికి చెందిన గొల్ల ఘట్టన్నకు ప్రమాదవశాత్తు కాలు విరిగితే వికలాంగుల ఫింఛన్ కోసం ఎమ్మెల్యే వద్దకు వెళితే ఆ పార్టీ నాయకులు ఘట్టన్నకు ఫింఛన్ చేయిస్తామని బలంతంగా గులాబీ కండువా కప్పారని జీఎంఆర్ వివరించారు. ఇలా తమ పార్టీ కార్యకర్తలను ఊరూరా ఏవో శంకుస్థాపనలంటూ ఎన్నికల ముందు లేనిపోని ఆర్భాటాలు చేస్తున్నాడని జీఎంఆర్ విమర్శించారు.మీడియా సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితోపాటు నాయకులు గోవర్ధన్‌గౌడ్,హరియా నాయక్, లక్ష్మీకాంత్ రెడ్డి,లిక్కి నవీన్‌గౌడ్,లిక్కి విజయ్‌కుమార్ గౌడ్,రావులపల్లి నర్సింహులు,హన్నాపూర్ కొండయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జీఎంఆర్

# మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం సంతోషకరం...



గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుర్పిస్తున్న దృశ్యం





కల్వకుర్తిలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



దేవరకద్ర గ్రామాపంచాయతీ వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి,అక్టోబర్02 ప్రభాతవార్త:** మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ఎంతో సంతోష కరంగా ఉందని మల్లిఖార్జున అన్నదాన సత్రం అధ్యక్షులు, ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ఛైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జయంతి వేడుకలకు మిడిదొడ్డి శ్యాంసుందర్ ముఖ్య అతిథిగా హజరై వాసవీక్లబ్ సభ్యులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, వారి కృషి త్యాగాల ఫలితమే ఇవాల స్వేచ్ఛగా మనం జీవిస్తున్నామన్నారు.

**గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం...**

**కల్వకుర్తిలో...** మహాత్మాగాంధీ చూపిన అడుగుజాడల్లో నడుద్దామని వాసవీక్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. మహాత్ముడి గాంధీ జయంతిని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్, బస్టాండ్, మార్కెట్‌యార్డ్, గ్రామ పంచాయతీ, వాసవీక్లబ్ భవనంలో గాంధీ విగ్రహాలకు గాంధీ జయంతి సందర్భంగా కల్వకుర్తి ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్, కేసీజీఎఫ్, వనితాక్లబ్, అవోపా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానాలో పండ్ల పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో కలిమిచెర్ల రమేష్, శివ్వ జగదీశ్వర్, దాచేపల్లి మనోహర్, మాచిపెద్ది అశోక్, కల్వకుర్తి వాసవీక్లబ్ కేసీజీఎఫ్, వనితక్లబ్ అధ్యక్షులు చిదిరే శ్రీలక్ష్మి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వ లక్ష్మి ఆంజనేయులు, కోశాధికారులు దుగ్గి అశోక్, విజయ్, భాస్కర్, చిగుళ్లపల్లి శ్రీధర్, గౌరయ్య, కొండూర్ కృష్ణయ్య, బాదం రాఘవేందర్, శివ, శ్రీనివాసులు, గుండ్ల శ్రీను, జూలూరి విజయ, రవి, పీఎస్ఎన్ గుప్త, రాజేష్, వెంకటేష్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

**మహాత్ముని బాటలో నడుద్దాం...**

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో మహాత్మునికి ఘన నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని బొక్కలకుంట రోడ్డు, బస్టాండ్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలిమిచెర్ల రమేష్ మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలో నడుద్దామని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, జాయింట్ సెక్రటరి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, దొంతు శ్రీనివాస్, సతీష్, మెంబర్‌షిప్ విద్యా కమిటీ ఛైర్మన్ కిషన్, రాఘవేందర్, అశోక్‌కుమార్, పూరి రమేష్ సభ్యులు తదితరులు ఉన్నారు.

**ఘనంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు**

**దేవరకద్ర,అక్టోబరు 02 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం జాతిపితా మహాత్మాగాంధీ 154వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత యంపీడీఓ కార్యాలయం వద్దనున్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్,వ్యవసాయమార్కెట్ ఛైర్మెన్ విజయవెంకటేశ్,మైనార్టీ నాయకుడు గౌస్,నాయకుగు కొండ భాస్కర్‌రెడ్డి, ఉమ్మిగారి వెంకటేశ్,బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు యుగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జయంతీ వేడుకలలో కొండ ప్రశాంత్‌రెడ్డి**

దేవరకద్రలో సోమవారం జరిగిన జాతిపితా మహాత్మాగాంధీ 154వ జయంతి వేడుకలలో టీపీసీసీ రాష్ట్రకార్యదర్శి కొండప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా పాత యంపీడీఓ కార్యాలయం వద్దనున్న మాహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో చంద్రయ్యశెట్టి,హరికాంత్, కల్వనరేశ్,కిషోర్‌కుమార్‌లతో పాటు కేపీఆర్ యూత్ అధ్యక్షుడు రాజు,శ్రీను,ఖాదర్,రామంజి, మహేశ్,అరవింద్,రఘు,కృష్ణయ్య,మంజుల,స్థానిక ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ప ంచాయతీ కార్యాలయం వద్ద...**

దేవరకద్ర మేజర్ గ్రామపంచాయతీ వద్ద సోమవారం జాతిపితా మాహాత్మాగాంధీ 154వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ విజయలక్ష్మీ,ఈఓ సీత్యానాయక్,బాల్‌రాజ్,యుగేందర్‌రెడ్డి,రాము,వీరారెడ్డిలతో కేపీఆర్ యూత్‌అధ్యక్షుడు రాజు,అంజి,యణిదీప్,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మహాత్మాగాంధీ జయంతి వేడుకలు**

**నవాబ్‌పేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** జాతి పిత మహాత్మాగాంధి జయంతిని పురస్కరించుకుని నవాబ్‌పేట మండలంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస నివాళులర్పించారు.ఈవేడుకల్లో మహబూబ్‌నగర్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు రంగారావు, నవాబ్‌పేట మండలం అధ్యక్షులు నీరటి రాంచంద్రయ్య, హమీద్, మహేక్, మండల ఓబిసి సెల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, రాష్ట్ర మత్స్యశాఖ సెక్రెటరీ కోట్ల రాజేష్, రాష్ట్ర మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ ఎండి షబ్బీర్, జడ్చర్ల నియోజకవర్గం మహిళా ఇంఛార్జి డా. మీనాక్షి, జిల్లా మైనార్టీసెల్ జనరల్ సెక్రెటరీ మైనొద్దిన్, నవాజ్‌రెడ్డి, మండల ఎస్టీసెల్ అధ్యక్షులు హరినాయక్, వార్డు మెంబర్ జమ్మూబాయ్, సింగిల్ విండో డైరెక్టర్ నర్సింలు, వార్డు మెంబర్ మర్కంటి నర్సింలు, తణ్యంరాజు, వార్డు మెంబర్ బంక శ్రీనివాస్, జమ్ము కొనింటి శ్రీనివాసులు, బ్యాగరి నాగరాజు, తమ్మాలి సురెందర్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**ఘనంగా గాంధీ జయంతి వేడుకలు**

**ఉండవెల్లి,అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో సోమవారం గాంధీజి జయంతి వేడుకలను గ్రామ పంచాయతీలో సర్పంచ్ శేషన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామ పంచాయతీలోని ప్రతి ఒక్క పౌరుడు ఇంటి పరిసర ప్రాంతాలను, రోడ్లను, రోడ్లపై చెత్త చెదారం, మురుగునీరు పారించకుండా శుభ్రంగా ఉంచుకోవాల్సి బాధ్యత పౌరునిదే అని ప్రభుత్వం, గ్రామ పంచాయతీలు చేస్తాయని కాకుండా ప్రజలు శుభ్రం చేసుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన గ్రామాలను ఏర్పరచుకోవచ్చని సర్పంచ్ హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషన్‌గౌడ్, కార్యదర్శి జ్యోతి, వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎలిషా, గ్రామ ప్రజలు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

**ఘనంగా గాంధీజి 154వ జయంతి వేడుకలు**

**మూసాపేట,అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, ఎంఎ డిఓ కార్యాలయంతో పాటు వివిధ గ్రామాల్లో జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులు యంపీపీ రమాశ్రీకాంత్‌యాదవ్



జాతిపిత గాంధీజ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



జాతిపిత మహాత్మాగాంధి జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

## నేడు దేవరకద్రలో సబ్‌ట్రెజరీ కార్యాలయం ప్రారంభం..

- హాజరుకానున్న ఎమ్మెల్యే ఆల
- సబ్‌ట్రెజరీ పరిదిలో 3 మండలాలు
- అనందం వ్యక్తపరుస్తున్న ఉద్యోగులు,ప్రజలు
- ఎమ్మెల్యే ఆలకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగులు

**దేవరకద్ర,అక్టోబరు 02 ప్రభాతవార్త:** దేవరకద్రలో సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నారు.ఉదయం 10గంటలకు జరుగు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు.స్థానిక గ్రంథాలయం భవనం పక్కన ఉన్న ప్రభుత్వ భవనంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.దీనికి గాను దేవరకద్ర సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు.ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో దేవరకద్రలో సబ్‌ట్రెజరీ కార్యాలయం ఏర్పాటు అయింది.ఈ కార్యాలయం పరిదిలోకి దేవరకద్ర,చిన్నచింతకుంట,కౌకుంట్ల మండలాలు వస్తాయి.ఇక నుండి ఆయా మండలాలకు సంబందించిన ట్రెజరీ లావాదేవీలు ఈ ట్రెజరీలోనే జరుగనున్నాయి.ఇంతవరకు ఆయా మండలాల ఉద్యోగులు జీతాలతో పాటు ట్రెజరికి సంబందించిన ఏ బిల్లు సమర్పించాలన్న మహబూబ్‌నగర్‌కు వెళ్ళాల్సి వచ్చేది.ఇప్పుడు ఆబాద తప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల సౌకర్యార్థం ఎమ్మెల్యే ఆల ప్రత్యేక ప్రత్యేక చొరవతో దేవరకద్రలో ఈ సబ్‌ట్రెజరీ కార్యాలయం ఏర్పాటు చేయించారు.దీంతో దేవరకద్రలో సబ్‌ట్రెజరీ కార్యాలయం ఏర్పాటు చేస్తుండటంలో ఉద్యోగులు,ఆయా మండలాల ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.ఎమ్మెల్యే ఆలతో పాటు దీనికి సహకారం అందించిన యంపీపీ రమాశ్రీకాంత్‌యాదవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.





దేవరకద్ర సబ్‌ట్రెజరీ కార్యాలయం

**ఎమ్మెల్యే ఆల కృషితోనే సాధ్యం..**



దేవరకద్రలో సబ్‌ట్రెజరీ కార్యాలయం ఏర్పాటు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితోనే సాధ్యమైందని దేవరకద్ర యంపీపీ కుర్వ కెంగూరి రమాశ్రీకాంత్ యాదవ్ అన్నారు.మంగళవారం ఆమె మాట్లా డారు.ఆయా మండలాల ప్రభుత్వ ఉద్యోగులు,ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే ఆలఈ సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని దేవరకద్రలో ఏర్పాటు చేయించారన్నారు.ఇక మీదట ఉద్యోగులు బిలులు సమర్పించడానికి మహబూబ్‌నగర్‌కు వెళ్ళాల్సిన అవసరం లేదన్నారు.దీంతో ఎమ్మెల్యే ఆలకు ఆయా మండలాల తరపున యంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

## దాడులకు కేసులకు భయపడే ప్రసక్తే లేదు..

**వర్కటంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి**

**రాక్షసరాజ్యం, గుండా రాజ్యాన్ని సాగనంపే రోజులు దగ్గరలో ఉన్నాయి**



వర్కటం జనార్ధన్‌రెడ్డిని కలిసిన సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు

**మక్తల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గ ప్రజలు, విద్యావంతులు, మేధావులు, యువకులు, మహిళలు చైతన్యవంతమై స్థానికేతరుడైన చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సాగనంపేందుకు మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల మక్తల్ నియోజకవర్గం, ఉట్కూర్ మండల కేంద్రంలో మక్తల్ బిఆర్‌ఎస్ నేత, విజెఆర్ ఫౌండేషన్ అదినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డిపై ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అనుచరులు కర్రలతో దాడిచేసి తన వాహనాన్ని ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. అందులో భాగంగానే నర్వ సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అడవి సత్యారామ్ శివరాంరెడ్డి, కాల్వల జగదీశ్వర్‌రెడ్డి, బాబ్లూ, లంకల్ విజయ్, నర్వ అజిత్‌రెడ్డి, వారి మిత్రబృందం కలిసి దాడిని తీవ్రంగా ఖండించారు. నిరుపేదలకు సహాయ సహకారాలు అందించే మీలాంటి వారికి ఎల్లవేళలా తోడుంటామని, ఎవరికి ఎన్ని ఇబ్బందులు కలిగినా కలిసికట్టుగా పని చేసి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

## నేడు దేవరకద్రలో ఎమ్మెల్యే ఆల పర్యటన



**దేవరకద్ర,అక్టోబరు 02 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో మంగళవారం ఎమ్మెల్యే అల వెంకటేశ్వర్‌రెడ్డి పర్యటించనున్నారు.ఈ సంద ర్బంగా ముందుగా ఆయన ఉదయం 9.30లకు చౌదర్‌పల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అలాగే 10గంటలకు దేవరకద్రలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.10.30లకు దేవరకద్రలో నూతనం గా నిర్మించిన పశువైద్యశాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.11లకు దేవరకద్రలో నూతనంగా నిర్మించిన పిఏసిఎస్ గోదాంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని ప్రారంభిస్తారు.11.30లకు బల్సుపల్లిలో గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.12లకు నార్లోనికుంటలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉపకేంద్రం నిర్మాణం కోసం భూమిపూజ చేస్తారు.12.30లకు అడవిఅజిలాపూర్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు.1కు కోయిల్‌సాగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉపకేంద్రం నిర్మాణం కోసం భూమిపూజ చేస్తారు.అలాగే 1.30కు లక్ష్మీపల్లిలో గృహలక్ష్మీ ప్రొసెడింగ్‌లను లబ్ధిదారులకు అందజేస్తారని యంపీపీ రమాశ్రీకాంత్‌యాదవ్,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి,మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.కావున బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

## నూతన ఆసుపత్రిలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్



**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలో నూతన శ్రీ శివగంగి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ గద్వాల తాలూకా కో ఆర్డినేటర్ జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత పాల్గొన్నారు. ఆసుపత్రి యజమాని డా. అభినేష్, అడ్వకేట్ గంగాధర్, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితను సన్మానించారు. వీరి వెంట తిరుపతయ్య శ్రీనివాస్‌గౌడ్, ధరూర్ రవి, కొండపల్లి ఈశ్వర్, గార్లపాడు మల్లేష్, ఎల్కూర్ నరసింహులు, తిమ్మప్ప, శేఖరయ్య, మోహన్, నరసింహులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన జిఎంఆర్



**మూసాపేట,అక్టోబర్ 2 ప్రభాతవార్త:**జిల్లాకేంద్రంలోని నవోద య ఆసుపత్రిలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న మూసా పేట మండలం కొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మున్నూరు శ్రీనివాసులును సోమవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి.మధుసూదన్‌రెడ్డి (జిఎంఆర్), అడ్డాకుల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



**మూసాపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మూసాపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకుడు వాకిటి ఆంజనేయులు ఆదివారం అనారోగ్య కారణంగా చనిపోయారు. విషయం తెలియడంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం సోమవారం ఆంజనేయులు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళుర్పించి ఆంజనేయులు కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మి నరసింహయాదవ్, ఉద్యమకారుడు శివరాములు, అచ్చయ్యపల్లి సర్పంచ్ శేఖర్ తదితరులు తిమ్మాపూర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికై కసిరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి..

**-మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు అర్థరహితం: కసిరెడ్డి యువసేన నాయకులు**



**వెల్దండ, అక్టోబర్ 02, ప్రభాతవార్త:** నియోజకవర్గ అభివృద్ధి చేపట్టాలనే ఉద్దేశ్యంతోనే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి చేరారని, రాష్ట్ర మంత్రి హరీష్‌రావు కసిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలను కసిరెడ్డి యువసేన నాయకులు చెర్క రాజశేఖర్, కేశమల్ల కృష్ణ, హరికిషన్‌లు ఖండించారు. వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం మేరకు ప్రజలకు సేవా చేయాలనే ఉద్ధేశ్యంతోనే ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని, 2014లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి ప్రజా జీవితంలోకి అడుగు పెట్టారని, సీఎం కేసీఆర్ కసిరెడ్డి ప్రజాబలం చూసి అప్పటి టీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించి 2014 నుంచి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి చేసిన అభివృద్ధితోనే 2018 శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌గా గెలుపొందారన్నారు. నైతిక విలువలకు కట్టుబడి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి కేఎల్ఐ నీరు తీసుకొని రావడంతో కీలక పాత్ర పోషించారని, ఎమ్మెల్సీ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేశారన్నారు. ఆదివారం కల్వకుర్తి పర్యటనకు విచ్చేసిన హరీష్‌రావు కసిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని కొట్టేశారు. నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో నాయకులు కిషన్‌నాయక్, గోపాల్‌నాయక్, రామకృష్ణ, మహేష్, నరేష్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## యెన్నం ఆసుపత్రిలో వైద్య శిబిరం విజయవంతం

**వెల్దండ, అక్టోబర్02, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని యెన్నం ఆసుపత్రి చైర్మన్ యెన్నం హరికాంత్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా హరికాంత్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరాల వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మేలు చేకూరుతుందని, గ్రామీణ ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు వైద్యులు యెన్నం హరికాంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**వెల్దండ, అక్టోబర్02, ప్రభాతవార్త:** వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన దొబ్బల పార్వతమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తన వంతు సహాయంగా రూ.5వేల ఆర్ధిక సహాయాన్ని సురేష్‌రెడ్డి ద్వారా అందించారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్, కొండలు యాదవ్, గొడుగు మల్లయ్య, దొబ్బల మహేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల ధర్నా



**పెబ్బేరు, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు టీయుడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర పిలుపు మేరకు వనపర్తి జిల్లా అధ్యక్షులు గుండ్రతి మధు గౌడ్ అధ్యక్షతలో సోమవారం జర్న లిస్టుల ఆధ్వర్యంలో సుభాష్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,...దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కారు, రైల్వే పాస్, పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల వర్దన్, గోపాలకృష్ణ, విజయ్, బాలరాజు, కిరణ్, అతిక పాషా, రాజేంద్రప్రసాద్, మోహన్, రాజు, జ్యోతిష్, ఉమాశంకర్, తరుణ్, విభూది కుమార్ పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 2 ప్రభాత వార్త:** గవర్నర్ తమిళసై సౌందర రాజన్‌ను రాజ్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. పుడ్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన గోలి శ్రీనివాస్‌రెడ్డికి గవర్నర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి, భూక్యా జ్యోతి, సెక్రటరి మనోహర్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం ఎంపీ పోతుగంటి రాములు హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. పుడ్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికై మొదటి సారి ఎంపీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా సన్మానించినట్లు ఎంపీ రాములు తెలిపారు. అదే విధంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎంపీ రాములు, పుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డిలు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపూజీ సూచించిన బాటలో ప్రతి ఒక్కరు నడిచి అహింసమార్గాన్ని అనుసరించాలన్నారు.

## పందెం కోళ్ల స్థావరంపై పోలీసుల దాడులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 02 ప్రభాతవార్త:** కోడి పందేల స్థావరాలపై నాగర్‌కర్నూల్ పోలీసులు అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఎండబెట్ల గ్రామ శివారులోని గుట్టల ప్రాంతంలో సోమవారం వెలుగుచూసింది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ పరిసర గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు ఇంద్రకల్, ఎండబెట్ల గ్రామ సరిహద్దుల్లోని గుట్టల ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా కోళ్ల పందాలు ఆడుతున్నట్లు ఖచ్చితమైన సమాచారం అందడంతో వెంటనే ఎస్ఐ మహేందర్ పోలీస్ సిబ్బంది మఫ్టీలో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మూడు కోళ్లు, 9 ద్విచక్ర వాహనాలతో పాటు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 9వేల నగదును, కోళ్లకు వాడిన విషపూరిత కత్తులను స్వాధీనం చేసుకొని పరారీలో ఉన్న మరికొంత మందిని పట్టుకునేందుకు విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యేకు ఆశా కార్యకర్తల వినతి

**ఇటిక్యాల, అక్టోబరు 02 ప్రభాతవార్త:** వైద్యారోగ్య శాఖలో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం పారితోషికం కాకుండా నెలకు 18 వేల జీతం చెల్లించాలని గత 8 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. సోమవారం 8వరోజు మహాత్మాగాంధి 154వ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో గల మహాత్మాగాంధి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నివాళులర్పించడానికి హాజరైన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు మండల ఆశా కార్యకర్తలు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో నెలకు 18 వేల జీతం చెల్లించాలని, 5 లక్షల ప్రమాద భీమా, హెల్త్ కార్డులు, పనిభారం తగ్గించాలని, అధికారుల నుండి వేధింపులు ఆపాలని, 32 రకాల రిజిస్టర్లను ప్రభుత్వమే ప్రింట్‌చేసి ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు ఆశా కార్యకర్తలు అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు నాగేశ్వరమ్మ, గోపాలమ్మ, పారిజాత, సుగుణ, రేణుక, రాజేశ్వరి, కళావతి, హేమలత, సుగుణ, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం..

- **గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**
- **ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ**



వెల్దండలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**వెల్దండ, అక్టోబర్2, ప్రభాతవార్త:** జాతిపిత గాంధీజి అందరికి ఆదర్శ ప్రాయుడని, ఆయన ఆశయాలను కొనసాగించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు అన్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడు, జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతి వేడుకలను వెల్దండ మండల ఆర్యవైశ్య, వాసవీ క్లబ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెల్దండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గాంధీజీ చిత్రపటానికి, జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి యెన్నం భూపతిరెడ్డి, బచ్చురామకృష్ణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు మాట్లాడుతూ హింసకు తావు లేకుండా భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ఘనత మహాత్మాగాంధీజికే దక్కిందని వారు పేర్కొన్నారు. బాపూజీ కలలు కన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో గాంధీజి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గాంధీజి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, ఎంపీటీసీ చలిచిమల జ్యోతి నిరంజన్, వార్డు సభ్యులు కృష్ణారెడ్డి, యాదగిరి, అంజయ్య, నారాయణరెడ్డి, రంగయ్య, జహేదా, నాయకులు యెన్నం కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, యాఖుబ్, తాటికొండ కృష్ణారెడ్డి, క్యాసారపు వెంకటయ్య, భయ్య మల్లయ్య, అన్నెపు వెంకటేష్ ముదిరాజ్, ఆనంద్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కోశాదికారి శివ్వ జగదీశ్వర్, అదనపు కార్యదర్శి చిగుళపల్లి శ్రీధర్, వజ్రలింగం, సంతోష్ తదితరులు ఉన్నారు.

## మీడియాపై నిర్బంధం ప్రజాస్వామ్యానికే పెనుముప్పు

- **టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు మధుగౌడ్**



నిరసన వ్యక్తం చేసిన జర్నలిస్టులు

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్2, ప్రభాతవార్త:** మీడియా నిర్బంధం, అణచివేత భారతదేశ ప్రజాస్వామ్యానికే పెనుముప్పని టియు డబ్ల్యూ జే(ఐజే యూ) జిల్లా అధ్యక్షులు గుండ్రాతి మధు గౌడ్ హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వనపర్తి చేపట్టారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మాధవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో మీడియాను రక్షించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మీడియా రక్షణ చట్టాన్ని తేవాలని, కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలోని లోపాలను ఎత్తి చూపిన మీడియాను అణచివేస్తున్నారని కొందరు జర్నలిస్టులం హత్యకు గురి కాగా, మాఫియాబెదిరింపులు, దాడులు, అరెస్టులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాఫియా, అక్రమార్కులపై రాస్తే జర్నలిస్టులు దాడులు, ప్రాణ ప్రమాధాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు, ఇండ్లు, విద్య, ఆరోగ్యం, ఉద్యోగ, భద్రత, విధుల్లో రక్షణ కల్పించాలన్నారు. 2021 కరోనా నుంచి జర్నలిస్టులకు 50 శాతం రైతు పై రైల్వే పాలనులను ఇవ్వటం లేదని పునరుద్ధరించాలని కోరారు. సోషల్ మీడియాకు బాగా ఆదరణ పెరిగిందని డిజిటల్ మీడియా ప్రాధాన్యత సంతరించుకున్నదని అయితే ఆశ వార్తల్లో విశ్వసనీయత ప్రజా ప్రయోజనాలు గీటురాయిగా ఉండాలన్నారు. సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మధవరావు, జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు మల్యాల బాలస్వామి, సీనియర్ జర్నలిస్ట్ ఊషన్న, స్టాపర్ రాజు, ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కొండన్న యాదవ్, టౌన్ ప్రధాన కార్యదర్శి మన్యం, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నవీన్, ఉర్దూ పత్రిక రిపోర్టర్ కమల్ తదితరులు మాట్లాడారు. అనంతరం గాంధీ జయంతి సందర్బంగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, జిల్లా ఉపధ్యాక్షుడు యాకుల్, సీనియర్ జర్నలిస్ట్ పార్థ రెడ్డి, జర్నలిస్టులు, గోపాల్, బాబు, విష్ణు, శ్రీకాంత్, విజయ్ కుమార్, సి.అంజి కుమార్, వహిద్, మోహన్ బాబు, నరసింహ రాజు, సురేష్, శేఖర్, చిన్న, శివశంకర్, రాజు, ఫరూక్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, బిజెపి హామీలన్ని అసత్యాలే

- **టిపిసిసి సభ్యులు చింతలపల్లి జగదీశ్వర రావు**



మహనీయులకు పూలమాల వేసి పాదయాత్రకు ముగింపు పలికిన దృశ్యం

**వీపనగండ్ల, అక్టోబర్2, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో గాంధీ జయంతి పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలో సత్యమేవ జయతే పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా చింతలపల్లి జగదీశ్వరరావు, కొల్లాపూర్ నియోజకవర్గ పరిశీలకులు రజీవ్ జమా కండీకర్, వాసుదేవ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిజేఆర్ మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు అసత్యపు హామీలతో రాజ్యమేలుతున్నారని వీరి అసత్యపు హమీలు బయట పెట్టేందుకు సత్యమేవ జయతే పాదయాత్ర చేస్తున్నామని, అదేవిధంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీఅమలు చేయబోయే 6 గ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త వివరించాలని ఈ సందర్భంగా అన్నారు. ఇస్సర్ పెట్రోల్ బంక్ నుండి మొదలైన పాదయాత్ర బస్టాండ్ దగ్గరలోని మహాత్మా గాంధీ చిత్రపటానికి, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి పాదయాత్ర ముగించడం జరిగింది. ఆ తర్వాత 22 రోజుల పాటు నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆయాల సమ్మె శిబిరం దగ్గరికి వెళ్లి వారి సమ్మెకు సంఘీభావంగా మద్దతు తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే అంగన్వాడి ఉపాధ్యాయుల, ఆయాల డిమాండ్స్ నెరవేర్చాలని వారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గాదె సుధారాణి, రత్న ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్రమైనార్టీ కార్యదర్శి ఖాదర్ పాషా, వీపనగండ్ల గ్రామ కాంగ్రెస్ నాయకుడు పాము రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రాజెక్టు జాతీయ హెూదా ఏదీ?

**పాలమూరుకు ప్రధాని చేసింది శూన్యం : కాంగ్రెస్ నాయకులు**



**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్2, ప్రభాతవార్త:** తెలంగాణను సస్యశ్యామలం చేసే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జాతీయ హెూదా కల్పించకపోవడం దారణమని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్య క్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డిలు ఆరోపించారు. సోమవారం వనపర్తి జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డిలు ఆరోపించారు. సోమవారం వనపర్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెనుకబడ్డ పాలమూరు జిల్లాకు కృష్ణాజలాలపై న్యాయంగా రావాల్సిన వాటా తెలుస్తారేమోనని జిల్లా ప్రజలు ఎదురు చూసి నిరాశ చెందారని విమర్శించారు. పాలమూరు జిలా కలకు రావాల్సిన జలాలను హక్కులను కాలరాస్తూ ఇప్పుడు చిలుక పలుకులు పలుకుతున్నారని, గత ఎన్నికలలో హామీఇచ్చిన మోడీ ఏం చేశారని? ఎందుకు జాప్యం చేశారని ప్రశ్నించారు. ప్రధానమంత్రి పర్యటన పై వెనుక బడిన ప్రజలు యువకులు ఎంతో ఆశలు పెట్టుకొని ఏం వరాలు ప్రకటిస్తారని ఎదురు చూసి భంగపడ్డారన్నారు. నల్లధనం బయటకు తెస్తామని, ఒకొక్క అకౌంటులో 15 లక్షలు వేస్తామని మాయమాటలు చెప్పిన మోడీ మళ్లీ పాల మూరు గడ్డమీదకీ ప్రధాని నరేంద్ర మోడీ వచ్చి నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన పసుపు బోర్డు ప్రకటించడం హాస్యాస్పదమని అన్నారు. పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ ఈ రెండు హామీలు పాలమూరు జిల్లాకు సంబంధం లేనివని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి పై చిత్తశుద్ధి ఉంటే విభజన హామీలపై తక్షణమే చర్చ చేసి కావాల్సిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం మోడీ మోసపూరిత హామీలు ఇచ్చి ఎన్నికల స్టంటులతో తెలంగాణ ప్రజల హృదయాలను గెలవలేరని స్పష్టం చేశారు. ఏమిచ్చారని బీజేపీ నాయకులు సంబరాలు చేయడం సిగ్గుచేటని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటనారాయణ, వనపర్తి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, పెబ్బేర్ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు హరి కుమార్ రెడ్డి, ఘనపురం మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బాల్ రెడ్డి, పెద్దమందడి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, శ్రీరంగాపురం మండల కిసాన్ జిల్లా అధ్యక్షులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశానికి లోను కావొద్దు

- **జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి పి.పాపిరెడ్డి**
- **జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం**



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాపిరెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు2 ప్రభాతవార్త:** భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని ఎలా ఉపయోగించుకోవాలో మన చేతుల్లోనే ఉంటుందని మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి బి.పాపిరెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ 90 శాతం కేసులు క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న వారివే ఉన్నాయని అన్నారు. అలా కాకుండా ఎవరి జీవితాన్ని వారు ఎలా మలుచుకోవాలో తెలుసుకోవాలని చెప్పారు. జైలులో ఉన్న కాలంలో నేరం చేస్తే ఎలాంటి శిక్ష ఉంటుందో ఖైదీలకు తెలిసి ఉంటుందని, దీన్ని గుర్తుంచుకుని భవిష్యత్తులో నేరాల జోలికి వెళ్లకుండా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, జైలు జీవితాన్ని సద్వినియోగం చేసుకుని సమాజంలో మంచి పౌరులుగా బ్రతకాలని అన్నారు. చట్టంలో నేరాన్ని ద్వేషించు నేరస్తున్నికాదు అని ఉందని, అందువల్ల నేరస్తులుగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో జైలు జీవితం నుండి బయటికి రావాలని చెప్పారు. ఖైదీల సంక్షేమం కోసంప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ముఖ్యంగా ఖైదీలు ఎలాంటి సంస్కరణలు తీసుకువస్తే బాగుపడతారో అలాంటివి అమలు చేయడం జరుగుతున్నదని తెలిపారు. తమ తరపున వాదించడానికి న్యాయవాదులు లేని కారణంగా అనేక మంది శిక్షలు అనుభవిస్తున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకుని 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్‌ను తీసుకురావడం జరిగిందని, ఈ చట్టం ప్రకారం న్యాయ సాయం కావలసిన వారికి, న్యాయవాది అవసరమైన వారికి న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి విచారణ చేయకుండా ఎవరికి శిక్ష విధించరాదని ఆయన తెలిపారు. ఖైదీల సంక్షేమ దినోత్సవం రోజున వారికి ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించడం వల్ల కొంతమందైనా మారతారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఎవరు కోరి శిక్షలు చేయరని క్షణికావేశంతో తప్పు చేసిన వారు ఎంతో మంది ఉంటారని, అలాంటి శిక్ష పడినవారు జైలునుండి విడుదల అయిన తర్వాత ఒక సొసైటీకి ఒక మంచి వారుగా తయారు కావాలని అన్నారు. ప్రభుత్వం ఖైదీల కోసం అనేక సంస్కరణలను తీసుకురావడం జరిగిందని, జైలు జీవితంలోని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సహకారాలు అందిస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జైల్లోని ఖైదీలు కూరగాయల పెంపకంతో పాటు, ఇతర వస్తువులను తయారు చేస్తున్నారని ఇది చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం గాంధీజీ అనేకసార్లు జైలుకెళ్లారని, సత్యం, అహింసా, ధర్మం సిద్ధాంతాన్ని పాటించిన గాంధీజిని ఆదర్శంగా తీసుకుని మంచి పౌరులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. జైలు శిక్షణాలయం లాంటిదని, దీనిని సద్వినియోగం చేరుకుని సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. జైలును శిక్షణ సంస్థగా ఉపయోగించుకోవడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ మంచి పౌరుడుగా బయటకు రావాలని ఆయన కోరారు. నేరాలు లేని సమాజాన్ని తీర్చిదిద్దడమే మనధ్యేయం కావాలని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఎంకె పద్మావతి మాట్లాడుతూ ఖైదీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని, ఖైదీలు సత్ప్రవర్తనతో బయటికి వెళ్లాలని, బయటికి వెళ్లిన తర్వాత సమాజంలో మంచి పౌరులుగా బతకాలని పిలుపునిచ్చారు. లీగల్‌ఎయిడ్ కౌన్సిల్ హెడ్‌రఘుపతి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిడా.కృష్ణ మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ పోటీలో గెలుపొందిన ఖైదీలకు ముఖ్య అతిథులు జ్ఞాపికలను అందజేశారు.

## ఆశా వర్కర్లకు సరైన వేతనం ఇవ్వాలి

**ఉండవెల్లి, అక్టోబరు 02 ప్రభాతవార్త:** ఆశా వర్కర్లకు పారితోషికాలను రూ. 18 వేలు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సోమవారం తహసిల్దార్ కార్యాలయం నుండి మహాత్మా గాంధి జయంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ర్యాలీగా వెళ్లి సమస్యలు పరిష్కరించాలనే నినాదాలతో మహాత్మాగాంధి విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సిఐటియు మండల కార్యదర్శి యు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 32 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో గత 18 సంవత్సరాల నుండి పని చేస్తున్నారు. ప్రారంభం నుండి ఇప్పటవరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారు. రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బిపి, షుగర్, థైరాయిడ్ తదితర అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడం ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారు. డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అనేక ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందన్నారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్న పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆశాలకు నేటికి ఫిక్స్ వేతనం నిర్ణయం చేయకపోవడం వల్ల ఆశావర్కర్లు అన్యాయానికి గురవుతున్నారనివాపోయారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు రాజమ్మ, అమ్ములమ్మ, మదనమ్మ, బీసమ్మ, శారద, పుష్పావతి, వెంకటేశ్వరమ్మ, వరలక్ష్మి, భాగ్యమ్మ, జ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల దీక్షకు సిఆర్ మద్దతు

**పానగల్, అక్టోబర్2, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో దాదాపు వారం రోజుపాటు నిరవధిక దీక్ష కొనసాగిస్తున్న ఆశ కార్యకర్తల దీక్షకు నియోజకవర్గం సిఆర్ జగదీశ్వర్ రావు మండల ఎక్స్ ఎంపీపీ సుధారాణి, కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని ఆశా కార్యకర్తల డిమాండ్లను నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. 24 గంటల పాటు సేవలు అందించే ఆశ కార్యకర్తలకు పిఆర్సి తో పాటుప్రభుత్వ అలవెన్సులు అదే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు వారి డిమాండ్ నెరవేర్చకపోతే భవిష్యత్తులో వారికి తమ సహాయం ఎల్లవేళలా ఉంటుందని వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## వృద్ధులను ప్రేమగా చూసుకుందాం!

**చిన్నచింతకుంట, అక్టోబర్2, ప్రభాతవార్త:** కుటుంబంలోని పెద్ద దిక్కుగా ఉండే వృద్ధులను కుటుంబ సభ్యులు ప్రేమగా చూడాలని స్థానిక ఎంపిటిసి ఉషారాణి ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వృద్ధాప్యం అనేది ఒక వరం లాంటిదని, వృద్ధులను దూషించడం, ద్వేషించడం మాని ఆదరిస్తే ఆ కుటుంబాలు ఉన్నతంగా ఉంటాయని తెలిపారు. అనుభవజ్ఞులైన వృద్ధుల అనుభవాలను కుటుంబానికి ఎంతో దోహదపడుతాయని వారి ఆలోచనలను స్వీకరించాలని ఆమెతెలిపారు. అనంతరం 80 సంవత్సరాలు నిండిన వృద్ధులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఒకటవ వార్డు సభ్యురాలు శారద దావీదు, బిఆర్ఎస్ మండల నాయకులు వజీర్‌బాబు, మండల వయో వృద్ధుల సంఘం మండల అధ్యక్షులు జి. మోషే, గ్రామ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివయ్య, గోపాల్, సభ్యులు వెంకటరామిరెడ్డి, షమీం, గంజి కాంతయ్య, గుండన్న, అబ్రహాం, శేఖర్, ఇజ్రాయిల్, అశోక్, ఎంకె విజయ్ పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**చిన్నచింతకుంట, అక్టోబరు 2 ప్రభాతవార్త :** మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 4న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సర్వస్య సమావేశానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికతో హాజరు కావాలని అలాగే ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

## నివాళులర్పించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

**ఇటిక్యాల, అక్టోబరు2 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన భీమేష్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం సోమవారం గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని చాగాపురం గ్రామానికి చెందిన తిమ్మన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, చాగాపురం గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త తిమ్మన్న అనారోగ్యానికి గురై మృతి చెందగా కార్యకర్త తిమ్మన్న అనారోగ్యానికి గురై మృతి చెందగా విషయం తెలుసుకుని ఆయన గ్రామానికి చేరుకుని తిమ్మన్న భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి రాముడు, అల్లాబకాష్, రవిరాజు, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు వెంకటన్న పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య క్షేత్ర స్థాయిలో కల్వకుర్తి శిశుమందిర్ విద్యార్థుల ప్రతిభ

**కల్వకుర్తి, అక్టోబర్ 02 ప్రభాతవార్త:** అక్టోబర్ 01, 02 తేదీల్లో గుంటూర్ జిల్లా నూతక్కిలో ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మధ్య దక్షిణ మధ్య జరిగిన క్షేత్ర స్థాయి గణిత విజ్ఞాన మేళా సంస్కృతి మహోత్సవ్‌లో కల్వకుర్తి శిశు మందిర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలవర్గంలో అరవింద్, కిశోర వర్గ లాబ్ శివమణి, వి.మనస్విని, వి.చరణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులు వచ్చే నెల ఢిల్లీ మరియు పంజాబ్‌లో నిర్వహించే దేశ స్థాయి గణిత విజ్ఞాన మేళా సంస్కృతి మహోత్సవంలో పాల్గొంటారని పాఠశాల ప్రధానాచార్యులు కృష్ణమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను పాఠశాల సమితి సభ్యులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీలో చేరిక

**కెటిదొడ్డి, అక్టోబర్ 02 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కెటిదొడ్డి మండల పరిధిలోని ఉమిత్యాల తండాకు చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి హనుమంతు, పాండు, హర్ష, హరిచంద్, రత్నం నాయక్, లొక్క, లక్ష్మణ్ వీరితో పాటు మరికొంత మంది ఆ పార్టీలకు గుడ్‌బై చెప్పి నేడు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కెసిఆర్ నాయకత్వాన్ని బలపరచుటకు బిఆర్ఎస్ పార్టీలోకి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉమిత్యాల తండాకు చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జడ్పీటిసిలు రాజశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామకృష్ణ నాయకుడు, సర్పంచ్ సక్రునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుందు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రధర్‌రావు నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరిన బిజెపి నాయకుడు

**కెటిదొడ్డి, అక్టోబర్ 02 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల కేంద్రంలో డికె బంగ్లాలో కెటిదొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన ఎర్ర భీంరెడ్డి గత ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ డికె అరుణమ్మ వెంటనే ఉంటామని బిజెపి పార్టీలో పని చేస్తామని తిరిగి సొంత గూటికి బిజెపి పార్టీలో చేరడంతో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం క్రిష్ణరెడ్డి, మండల అధ్యక్షుడు హనిమిరెడ్డి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మీర్జాపురం రామచంద్రారెడ్డి, ధరూర్ కిష్టన్న, అల్లపాడు ప్రతాప్, లక్ష్మిరెడ్డి, నాగిరెడ్డి, హనుమంతరాయుడు, శేఖర్‌రెడ్డి, మైలగడ్డరాములు, శ్రీపాదరెడ్డి ఉన్నారు.

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను సాగనంపాలి

**చిన్నంబావి,అక్టోబరు 02 ప్రభాతవార్త:** రాష్ట్రంలో, దేశంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను సాగనంపాలని నేటి యువత వారి భవిష్యత్తు కోసం ఓటు ద్వారా ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని, నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత గాంధి అని వారి భావాలే యువతకు ఆదర్శమని టిపిసిసి సభ్యులు చింతల పల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సత్యమేవ జయతే పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ ఏఐసిసి, టిపిసిసి ఆదేశాల మేరకు అబద్ధపు హామీలతో రాజ్యమేలుతున్న కెసిఆర్ బండారం బయట పెట్టేందుకు గాంధీ జయంతిని పురస్కరించుకుని సత్యమేవ జయతే పాద యాత్రలో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గ అబ్జర్వర్ రాజీవ్ జమాఖండ కర్, వాసుదేవ్‌మూర్తిలతో కలిసి మహాత్మాగాంధి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి పాదయాత్రకు ముగింపుపలికారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రావు మాట్లాడుతూ నాడు మహాత్మాగాంధి సత్యం, అహింసా అనే రెండు ఆశయాలతో ప్రజలలో చైతన్యం కల్పించి మనకు స్వాతంత్ర్యం సాధించి బ్రిటిష్ వారిని ఈ భారతదేశం నుండి వెళ్లగొట్టారో అదేవిధంగా మనం కూడా కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోయే 6 హామీలతో ప్రజలలో చైతన్యం కల్పించి ఈ రాష్ట్రం నుంచి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని దేశం నుండి బిజెపి ప్రభుత్వాన్ని తరిమికొడదామన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాముయాదవ్, కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గాదెల సుధారాణి, రత్న ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఖాదర్‌పాషా, చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**వనపర్తి క్రైం,అక్టోబరు2 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం పర్వతాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బోయ చిన్నయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆ కుటుంబాన్ని ఫోను ద్వారా పరామర్శించి ఓదార్చారు. మాజీ సర్పంచు బాలస్వామి ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డబ్బా చెన్నయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**నారాయణపేట ప్రతినిధి,అక్టోబరు2 ప్రభాతవార్త:** యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి జనాభా దామాషా నిధులు కేటాయించాలని అచల భారత యాదవ మహాసభ నారాయణపేట జిల్లా శాఖ డిమాండ్ చేసింది. అచల భారతయాదవ మహాసభ జిల్లా కన్వీనర్ తిరుపతి యాదవ్ అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి సమావేశం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సిటిజన్ క్లబ్‌లో కార్యక్రమంలో జిల్లాలోని మండలాల నుంచి ముఖ్య నాయకులు హాజరవడం జరిగింది. కార్యక్రమం ముఖ్యఉద్దేశం నారాయణపేట జిల్లా కేంద్రంలో అచల భారత యాదవ మహాసభ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కార్యక్రమంలో అచల భారత యాదవ మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘువీర్ యాదవ్, సత్య యాదవ్, వినయ్ మిత్ర యాదవ్, రాములుయాదవ్, బాలప్ప, గోపాల్‌యాదవ్, బాలగోపాల్ యాదవ్, చెన్నప్ప యాదవ్, ఉట్కూర్ వెంకటయ్య యాదవ్, సీనియర్ నాయకులు చిన్నయాదవ్, పెంటప్ప యాదవ్, బాలకృష్ణయ్య యాదవ్, సర్పంచ్ మల్లేష్, రమేష్‌యాదవ్, పెద్దవెంకటప్ప యాదవ్, కృష్ణ యాదవ్, మల్లప్ప, ఊసప్ప, కేశవ్ యాదవ్ పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**మక్తల్, అక్టోబరు02 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో రాంరెడ్డి మహబూబ్‌నగర్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ సేవా భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం లయన్ బి. అంబదాస్‌రావు అధ్యక్షతన లయన్ అనుగొండ శ్రీనివాసులు, విజన్ డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్ సహకారంతో మెగా కంటి వైద్య శిబిరం విజయవంతం చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి లయన్స్ క్లబ్ ద్వారా కంటి శస్త్ర చికిత్సలు చేయించి ఎంతో మందికి చూపుని ప్రసాదించిన లయన్స్ క్లబ్‌కు దక్కిందన్నారు. 150 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించగా 75 మందికి కంటి పొరలు సమస్యలు ఉన్నట్లుగా గుర్తించి వారిని కంటి ఆపరేషన్ నిమిత్తం మహబూబ్ నగర్ జిల్లా రాంరెడ్డి లయన్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో లయన్ రాజుల ఆశిరెడ్డి, లయన్ వి.నరేందర్, లయన్ యాలాల వీరేశం, సెక్రెటరీ లయన్ వాదిరాజ్, లయన్ రవికుమార్, జాయింట్ సెక్రెటరీ లయన్ మామిళ్ల పృథ్వీరాజ్, లయన్ సత్యాంజనేయులు, లయన్‌డివిచారి, లయన్ నాగరాజు, లయన్ శరణప్ప, లయన్ సిద్ధిలింగప్ప, ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టిన తర్వాతే జిల్లాలో కాలు పెట్టాలి

**నారాయణపేట ప్రతినిధి,అక్టోబరు02 ప్రభాతవార్త :** జిల్లా రైతులకు సాగునీరు జిఓ69 నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టి సాగునీరు ఇచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి, మంత్రులు పేట జిల్లాలో కాలు పెట్టాలని జలసాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్. నర్సింహ, బిజెపి మండల అధ్యక్షులు సి. లక్ష్మణ్ పట్టణంలోని ఐబిలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 4వ తేదీన మక్తల్‌కు వస్తున్న రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్ రావు జిఓ 69 నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారానే సాగు నీరు ఇస్తామని జిల్లా రైతులకు చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా పేట జిల్లా రైతులకు సాగునీరు రాదని ఇంజనీర్లు చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నది నీళ్లు, నిధులు, నియామకాల కోసమే అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత పేట జిల్లా రైతులకు చాలా నష్టం జరిగిందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేట జిల్లాకు సాగునీరు ఇవ్వాలని జిఓ 69 నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలని గవర్నర్ 69 జారీ చేస్తే ఆ జిఓను బిఆర్ఎస్ ప్రభుత్వం, కెసిఆర్ ప్రభుత్వం రద్దుచేసి పేట జిల్లా రైతులకు సాగు నీరు రాకుండా చాలాఅన్యాయం చేశారని తెలిపారు. పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ఇచ్చిన తర్వాతే జిల్లాలో ముఖ్యమంత్రి, మంత్రులు కాలు పెట్టాలని తెలిపారు. రైతులకు చేసిన పాపం పోవాలంటే జూరాల ప్రాజెక్టులోని 7.10 టిఎంసి నికర జలాలతో నారాయణపేట జిల్లాలోని పది మండలాలకు 1,50,000 సాగునీరు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు నాగప్ప, ప్రతాప్‌రెడ్డి, రైతులుచంద్రశేఖర్‌రెడ్డి, ఆశప్ప, చంద్రప్ప, లక్ష్మణ్, నర్సింహులు, మైబు, తిరుమలేష్, ఆనంద్ పాల్గొన్నారు.

## సత్యమేవ జయతే పాదయాత్ర

**వీపనగండ్ల,అక్టోబర్2,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో సోమవారం నాడు జూపల్లి కృష్ణారావు వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ అవరణ నుండి గ్రామ వీధులగుండా తిరుగుతూ సత్యమేవ జయతే పాయయాధ్ర చేస్తూ బస్టాండ్ ఆవరణలో మహాత్మా గాంధీ చిత్రపటానికిపూలు సమర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య, వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎత్తుం కృష్ణయ్య, వెంకటరెడ్డి, గ్రామ అధ్యక్షుడు నక్క విష్ణు, ముంతటి గోపి, రవీందర్ రెడ్డి, వైయస్ వెంకటయ్య, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాత్ముని జీవితం ఆదర్శం : జిల్లా ఎస్పీ

**వనపర్తి క్రైం,అక్టోబర్2,ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణ మూర్తి అన్నారు. సోమవారం జాతిపిత మహాత్మా గాంధీజి 154 వ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి అక్టోబర్ 2న గాంధీ జయంతిని ప్రకటన చేసిన తరువాత ప్రపంచ వ్యాప్తం గా అంతర్జాతీయ ఆహింస దినంగా జరుపుకుంటారని తెలిపారు. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే మూడు ఆయుధాలతో బ్రిటిష్ వారిపై పోరాటం చేసి దేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన గొప్ప యోధుడు గాంధీజీ అని కొనియాడారు. నేటి యువత గాంధీజీ జీవన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. దేశంలో అన్ని కులాల, మతాల ప్రజలు కలిసి మెలిసి ఉండాలని సంకల్పించిన గొప్ప మానవతావాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిఐ మధుసూదన్, శ్రీనివాస్, అప్పలనాయుడు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, కార్యాలయపు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు















**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** హక్కుల సాధనకై శాంతియుత పోరాట మార్గాన్ని ఆచరణలో పెట్టిన మహాత్మాగాంధీ చిరస్మరణీయులని కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీల సంయుక్త పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగం శశిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ సునిత, రాజ్‌దీప్‌లతో కలిసి రాజేష్‌రెడ్డి నివాసం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అక్కడి నుంచి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా గాంధీ పార్క్‌కు చేరుకొని మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేష్‌రెడ్డి మాట్లా డుతూ ప్రపంచానికి అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన గాంధీ మార్గం ఎప్పటికి ఆదర్శప్రాయమని, అనుసరణీయమన్నారు. కార్యక్రమంలోకాంగ్రెస్ నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఉన్నారు.

**కల్వకుర్తిలో:** అహింస వాద సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐసీసీ పిలుపుమేరకు సత్యమే జయంతి అనే నినాదంతో కల్వకుర్తి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి గాంధీనగర్‌లో గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజి స్ఫూర్తితో పనిచేస్తూ రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంతకు ముందు పాలమూరు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికిపూలమాలలు వేసినివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులుశ్రీకాంత్‌రెడ్డి, జగన్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, చంద్రకాంత్‌రెడ్డి, భారతమ్మ, యూన్సీ, గంగా, పాండుగౌడ్, గోపాల్, సైదులు, శేఖర్, కరుణ్, ధ్యాస, శంకర్, శ్రీధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

**కల్వకుర్తి, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా పాత, కొత్త మున్సిపాలిటి కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మున్సిపాలిటి కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి, కొత్త మున్సిపాలిటిలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం మాట్లాడుతూ అహింసమార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్ముడు గాంధీజీ అని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్లు బాలునాయక్, గోరటి శ్రీనివాస్, ఏజాస్, సైదులుగౌడ్, బోజిరెడ్డి, మనోహర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, నూనె శ్రీనివాస్, కిశోర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాధవరెడ్డి, నర్సింహ్మా, వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వాసుపత్రిలో:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీజీ మన భారత స్వాతంత్ర ఉద్యమంలో క్రియాశీలకమైన పాత్ర పోషిస్తూ అహింస, శాంతియుతమే ఆయుధాలుగా మన దేశ స్వాతంత్రం సాధనలో వారి కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు యశోదబాయి, విష్ణుప్రియ, సుష్మ, నర్సింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి, హెడ్ నర్సులు సునీత, సిబ్బంది ఉన్నారు.

**కల్వకుర్తిరూరల్‌లో:** కల్వకుర్తి మండలంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్చాల గ్రామంలోని ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు నిజామొద్దీన్, ప్రగతి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం వంశీకృష్ణలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, గంజి గోపాల్, మధు, ప్రశాంత్, మహేష్, సాయిచారి, ఖాజామైనుద్దీన్, యాదయ్య, యూసుఫ్ బాబా, గణేష్, బీరయ్య, విశ్వేశ్వర్, లక్ష్మణ్, తాహేర్ తదితరులు ఉన్నారు.

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు2 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో సోమవారం పరిపాలన భవనంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి యూనివర్సిటీ పిజి కాలేజీ ప్రిన్సిపాల్ డా. చంద్రకిరణ్ ముఖ్య అతిథిగా హాజరై స్వాతంత్ర్యసంగ్రామంలోగాంధీజీ అవలంబించినఅహింసా విధానం గొప్పదని, ఆయన ఆశయాల కోసం పాటుపడాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమం పరీక్షల నియం త్రణ అధికారి డా. రాజ్‌కుమార్, అధ్యాపకులు డా. ఎస్ఎన్ అర్జున్ కుమార్, గాలెన్న, కరుణాకర్‌రెడ్డి, డా. రాజశేఖర్, డా. రవికాంత్, పండగ రామరాజు, రవిందర్‌గౌడ్, నాన్ టీచింగ్ సిబ్బంది రవిందర్, సత్యం పాల్గొన్నారు.

**భూత్పూర్, అక్టోబర్2, ప్రభాతవార్త:** భారత జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి వేడుకలు సోమవారం భూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అధికారులు, పలు పార్టీల నేతలు ఘనంగా నిర్వహించారు. భూత్పూర్ చౌరస్తాలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణ, మండల రైతు బంధు అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ముడా డైరెక్టర్లు సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, మూస పాయిలుతో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళిధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, బోరింగ్ నర్సింహులు, మేకల సత్యనారాయణ, రాముఠాథోడ్, సత్తూర్ అశోక్‌గౌడ్, గడ్డం రాములు, గడ్డం యాదయ్య, గడ్డం ప్రేమ్, గడ్డం మునుస్వామి, గడ్డం బీమస్వామి, మాల వెంకటేష్ పాల్గొన్నారు. ఇదే విధంగా కాంగ్రెస్‌పార్టీ నుంచి డీసీసీ అధ్యక్షుడు జీఎంఆర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మొహ్మద్ సాధిక్, హరియా నాయక్, లిక్కి నవీన్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నర్సింహులు, కొండలయ్య తదితరులు బాపూజీ ఘనంగా నివాళులర్పించారు. బీజేపి నుంచి పట్టణ అధ్యక్షుడు రవీందర్, జిల్లా నాయకుడు సత్తూర్ సత్తయ్య గౌడ్, మొహ్మద్ ఖలీల్, ఫారూఖ్, శ్రీనివాస్, సదానందం, రాజు, జితేందర్‌తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి గడ్డం ఎల్లప్ప గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. వీరితో పాటు అమిస్తాపూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మూస బాలస్వామి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేయగా, పోతుల మడుగులో మనెమోని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూత్పూర్ మున్సిపల్, మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల వద్ద గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి అధికారులు, ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు.

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్2, ప్రభాతవార్త:** దేశ స్వతంత్ర పోరాటం సమయంలో ఆధునిక మారణాయుధాలు కలిగిన బ్రిటిష్ వారితో ఎదురు వెళ్లి అదే ఆయుధాలతో పోరాటం చేయడం వల్ల ఫలితం ఉండదని గ్రహించిన గాంధీ అహింసా వాదంతో తిరుగులేని ఆయుధాన్ని బ్రిటిష్ వారి పై ప్రయోగించి, వారు ఏర్పాటు చేసిన సమావేశాలలో పాల్గొంటూ చాలా చాకచక్యంగా స్వాతంత్రాన్ని సంపాదించారని. ఆ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పొందాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాలు పవార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కార్యలయాల సమీకృత భవన ప్రాంగణంలో జాతిపిత గాంధీ, మాజీ ప్రధానిలాల్ బహుదూర్ శాస్త్రీల జయంతి ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాటాడుతూ గ్రామస్థాయిలో సమాజం ఆర్థికంగా, వ్యవసాయకంగా, విద్య, వైద్య రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆశించిన గాంధీకలలు సహకారం అవుతున్నాయని ఆయన అన్నారు. కష్ట సమయంలో భారతదేశంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న లాల్ బహుదూర్ శాస్త్రి జై జవాన్ కిసాన్ అనే నినాదంతో ముందుకు వెళ్లారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడానికి ఓటింగ్‌శాతం పెంచడానికి జిల్లాలో విశేషమైన జరుగు తుందని గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఫలితాలు అనుభ వంలోకి వస్తున్నాయని ఆయన అన్నారు. గాంధీజీ ఇచ్చిన స్ఫూర్తి ఎల్లవేళలా ఆచరణీయమని ఆ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిస్తూ, మంచి చేయాలని సంకల్పన ఉంటే చాలు తక్కువ సమయంలోనే సమా జానికి అవసరమైన మేలు చేయొచ్చని ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి నిరూపిం చాడని ఆయన కొనియాడారు. డిపిఓ నర్సింలు వ్యవసాయ మహిళా కళాశాల ప్రిన్సిపల్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పదవి విరమణ చేసిన వ్యవసాయ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం సుధాకర్ ను కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఏ కృష్ణ అగ్రాణమి ప్రొఫెసర్ లను సత్కరించారు.

**గద్వాల ప్రతినిధి, అక్టోబర్2, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని జాతిపిత మహాత్మాగాంధి 154 జయంతి సందర్భంగా చింతలపేట సమీపంలోని గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ శాంతికి మార్గదర్శి గాంధీజి అని దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశం అంతటిని ఒకే తాటిపైకి తెచ్చి స్వాతంత్ర్యాన్ని అందించడంలో ప్రముఖ పాత్ర వహించి తన చివరి శ్వాస వరకు శాంతి అహింసా మార్గాలను ప్రచారం చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అని గ్రామ పంచాయతీలు బాగుపడిన రోజు దేశం బాగుపడుతుందని గ్రామాలు అభివృద్ధి చెందాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఛైర్మన్ బాబర్, గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, కౌన్సిలర్లు కృష్ణ, నరహరి, శ్రీనివాసులు, మహేష్, నాగరాజు, శ్రీను, నరహరిగౌడ్, కెటిదొడ్డి మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుందు, గద్వాల టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి సాయి శ్యామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ధర్మ నాయుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాగులుయాదవ్, రంజిత్, రామకృష్ణశెట్టి, రిజ్వాన్, భగీరథ, వంశీ, కురుమన్న, మోబిన్, చిన్నవీరేష్, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**ఉప్పునుంతల, అక్టోబర్2, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధి జయంతి వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల ఎంపిడిఓ కార్యాలయం వద్ద మండల పంచాయతీ అధికారి నారాయణ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలరినపంచారు అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ సరితానంతరెడ్డి, ఉపసర్పంచ్ దొంతు పుల్లమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టానంతరెడ్డి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బంధం బాలకృష్ణ, సీనియర్ వైశ్య సంఘం నాయకులు, రేషన్ డీలర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారాం, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, గ్రామస్తులు పొట్టల నర్సింలు, చింతగాళ శ్రీనివాసులు, డి. మల్లయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవింద్రరావు ఆధ్వర్యంలో గ్రామ నడిబొడ్డున గాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎం. నారాయణ, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**అచ్చంపేట, అక్టోబర్ 02 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం అచ్చంపేట పట్టణంలోని 10వ వార్డులో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాళులర్పించారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు పోకల మనోహర్ ఉన్నారు.

**వంగూరులో:** స్వాతంత్ర్య సమరయోధులు, బ్రిటిష్ పాలకులను గడగడలాడించి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొని రావడానికి కృషి చేసిన మహాత్మా గాంధీ జయంతిని వంగూరు మండల కేంద్రంలో సర్పంచ్ అక్కి లావణ్య ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా వంగూరు మండల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొని రావడానికి ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్మద జనార్ధన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు హమీద్, ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, గ్రామ పెద్దలు జువ్వ కృష్ణయ్య, హరినాథ్, నాయకులునరేందర్‌గౌడ్, మురళి, కృష్ణయ్య, రఫి, శ్రీను ఉన్నారు.

**అడ్డాకుల, అక్టోబర్2, ప్రభాతవార్త:** అడ్డాకుల మండల కేంద్రంలో మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల ఎంపిపి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, యువ నాయకులు ఈ సందర్భంగా ఎంపిపి మండల, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి మార్గదర్శిగా నిలుస్తూ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి అధ్యక్షులు బి. తిరుపతిరెడ్డి, మండలకో ఆప్షన్ సభ్యులు ఖాజాగోరి, మండల యూత్ ప్రెసిడెంట్ ఎలుసరి బాలరాజు, తిమ్మాయిపల్లి సర్పంచ్ ఆంజనేయులు, అడ్డాకుల టౌన్ యూత్ అధ్యక్షులు మహేష్ యాదవ్, కాటారం ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బుచ్చన్న, వెంకటయ్య గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**కెటిదొడ్డి, అక్టోబర్2, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మాగాంధి జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గద్వాల నియోజకవర్గం కో ఆర్డినేటర్ ఆనంద్‌రెడ్డి, కెసిసి అధ్యక్షుడు అక్బర్, పార్టీ నాయకులు శేషాద్రి, గుంతబాయి శ్రీను, తిరుపతి వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

**శ్రీరంగాపురం, అక్టోబర్2, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జయంతి వేడుకలు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలో అన్ని గ్రామాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీపీ ఆర్. గాయత్రీ పృథ్వీరాజ్, స్థానిక సర్పంచ్ వినిలరాణి కురుమయ్య మండల కేంద్రంలో గాంధీ చౌరస్తాలో మహాత్మగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వాతంత్ర పోరాటంలో గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామ సర్పంచులు మంజుల రాజవర్ధన్ రెడ్డి, సత్యం యాదవ్, నిర్మల రాధాకృష్ణ, ఆంజనేయులు నాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, సునీత రాజశేఖర్, మండల కో ఆప్షన్ ఎండి. ఆరీఫ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

**వనపర్తి క్రైం, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ మాజీ ప్రధాని శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని సోమవారం టి.డి.పి, అఖిలపక్షం నాయకులు విగ్రహానికి, చిత్ర పటాలకు పులమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందిమల్ల అశోక్, సతీష్ యాదవ్, శ్రీనివాసులు, శ్రీధర్, రమణ, వెంకటయ్య యాదవ్, జోగు, శాంతన్న, సయ్యద్, జెమీల్, రవి యాదవ్, దస్తగిరి, నందిమల్ల, సాంబయ్య, వహీద్, ఖాదర్, డి. బాలరాజు, గొల్ల. శంకర్, అనిల్, ఫారూఖ్, రాజు పాల్గొన్నారు.

**పెబ్బేరు, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయినాథ్, వైస్ చైర్మన్ కర్రె స్వామి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**పానగల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించల్సిన అవసరం ప్రతి ఒక్కరి పై ఉందని పిసిసి సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్ రావు అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సోమవారం పానుగల్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.. అలాగే మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మహేష్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షడుడు రాము యాదవ్, వివిధ గ్రామాలలో సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. గాంధీజీ ఆశయాలను కొగునసాగిద్దామని పిసిసి సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్ రావు అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్బంగా సోమవారం పానుగల్ మండల కేంద్రంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మహేష్, బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. రేమద్దుల గ్రామంలో గాంధీ విగ్రహ దాత, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు పిట్లకతాల్ 40 వేల రూపాయల వెచ్చించి విగ్రహం చుట్టూరేలింగ్‌తో పాటు, నిచ్చెన, మెట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, అధికా రులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**కొల్లాపూర్, అక్టోబర్2 ప్రభాతవార్త:** దేశ స్వాతంత్రం కోసం సత్యం, శాంతి, అహింస ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర సమరంలో బ్రిటి ష్‌వారిని గడగడలాడించిన గొప్పవ్యక్తి బాపూజీ వారిని గడగడలాడించిన గొప్ప వ్యక్తి బాపూజీ అని ఇందిరాగాంధీ అభిమాన సంఘం అధ్యక్షులు రంగినేని జగదీశ్వరుడు అన్నారు. సోమవారం శ్రీవాణి విద్యా నిలయంలో 154 గాంధీ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకుని గొప్ప గొప్ప ఉద్యమాలు క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి గొప్ప ఉద్యమాలు నడిపి స్వాతంత్ర్యాన్ని సాధించిన జాతిపిత మహాత్మాగాంధి అన్నారు. మహాత్మాగాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, రజకస్వామి న్యాయవాది మధుసూదన్, బాలపీరు, విద్యార్థులు పాల్గొన్నారు.

**లింగాల, అక్టోబర్2 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీకి అడుగు జాడల్లో ముందుకు నడవాలని డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం లింగాల మండల కేంద్రంలోని మహాత్మాగాంధీజి విగ్రహం, ఏకలవ్య, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యమేవ జయతే పాదయాత్ర కార్యక్రమం లింగాల మండల కేంద్రంలో రెండు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఏఐసిసి పరిశీలకులు పివి మోహన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, రాజేందర్, ఎంపిపి లింగమ్మ, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ కొండల్‌రావు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, కిషన్‌నాయక్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గండీడ్, అక్టోబర్2 ప్రభాతవార్త:** మహాత్మాగాంధి స్ఫూర్తితోనే అహింసా మార్గంలో కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించారని జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, శాంతియుత మార్గం ద్వారానే ఏదైనా సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. గాంధి జయంతి సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయం వద్ద గాంధీజీ ఫొటో విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మనం నేడు స్వేచ్ఛ స్వాతంత్రాలతో జీవిస్తున్నామంటే అందుకు గాంధీజీలాంటి మహనీయులు చేసినపోరాటమే కారణమని అన్నారు. గాంధీజీ స్ఫూర్తితోనే కెసిఆర్ సైతం తెలంగాణ పోరాటంలో పాల్గొని విజయం సాధించారని తెలిపారు. కెసిఆర్ నాయకత్వంలో తామంతా పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించుకోవడం, ఇప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడం గొప్ప విషయం అన్నారు. ఎంపిపి మాధవిరాజ్‌కుమార్‌రెడ్డి, ఎంపిడిఓ రూపేందర్‌రెడ్డి, నాయకులురామచంద్రారెడ్డి, ఎపిఓ, ఎంపిడిఓ సిబ్బంది పాల్గొన్నారు.









